క్లుప్తంగా

స్పందన ఫిర్యాదుపై విచారణ



మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ నాగ అనసూయ

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మైనార్టీ కాలనీలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు సరిగ్గా పోవడం లేదని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం కలక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ నాగఅనసూయ మంగళవారం విచారణ చేశారు. కాలువలో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు మురుగునీరు బయటకు పారకుండా మట్టిని ఏర్పాటు చేస్తే సరిపోతుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉజ్మాకు సూచించారు. అనంతరం ఆమె గ్రామంలోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్డును పరిశీలించారు.

బీజామృతం తయారీపై అవగాహన



విద్యార్థులకు బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో మంగళవారం ఏపీఎస్ఎఫ్ ఎంసీఆర్పీ బాలస్వామి విద్యార్థులకు బీజామృతం తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. నీరు, దేశి ఆవు పేడ, గోమూత్రం, సున్నం, పుట్టమట్టితో బీజామృతం ఎలా తయారు చేయాలో వివరించారు. వాటి వల్ల విత్తన మొలక శాతం వంద శాతం వస్తుందని, అలాగే తెగుళ్లు రాకుండా కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, అగ్రి కల్చర్ వీ.టి.శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’ ఫిర్యాదులు పునరావృతం కారాదు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల సిటీ: స్పందనలో వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎంఎస్ నగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజలు, అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సచివాలయ సిబ్బంది వలంటీర్ల సమన్వయంతో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలన్నారు. అనంతరం వార్డులో పర్యటించి, నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్ పనులను పరిశీలించారు.

డ్రై డేను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

నంద్యాలటౌన్: ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మలేరియ అధికారి కామేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎంఎస్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆశా, వైద్య సిబ్బందికి వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్, ఫ్రైడే డ్రైడే యాప్ అపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సెంటర్ పరిధిలో ఏవైనా మలేరియా లేదా డెంగీ కేసులు ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ, వైద్య సిబ్బందికి కేటాయించిన ప్రాంతాలలో ఎక్కడైనా నీటి కుంటలు, మురుగు నీరు నిల్వ ఉంటే వెంటనే హైజిన్ యాప్‌లో జీపీఎస్ ద్వారా సంబంధిత పారిశుధ్య అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు.

బడిఈడు పిల్లల నమోదు పూర్తి చేయాలి

గోస్పాడు: సచివాలయాల పరిధిలో 5 నుంచి 18సంవత్సరాలు వయస్సు గల బడిఈడు పిల్లల స్థూల నమోదు నిష్పత్తి ప్రక్రియ సంబంధిత వివరాలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వలంటీర్లు వెంటనే పూర్తి చేయాలని ఎంఈఓ అబ్దుల్‌కరీం ఆదేశించారు. మండలంలోని పసురపాడు, గోస్పాడు, ఒంటివెలగల, యాళ్లూరు-1, 2 సచివాలయాల్లో నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని మూడు హైస్కూళ్లకు ప్రభుత్వం 19 డిజిటల్ బోర్డులు మంజూరైనట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు. మోడల్ స్కూల్‌కు 9, కేజీబీవీకి 5, గోస్పాడు హైస్కూల్‌కు 5 మంజూరు అయ్యాయన్నారు.

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పోషకులు అప్రమత్తంగా లేకపోతే పశువులు జబ్బుల బారిన పడే ప్రమాదముంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పశువులకు జబ్బ వ్యాధి, గొర్రెలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కాలంలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ టీకా ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ముఖ్యంగా పాకలు, పరిసరాల్లో తడి వాతావరణం ఉండకుండా, శుభ్రమైన నీరు, నాణ్యమైన ఆహారం అందజేయడమే కాకుండా జబ్బుబారిన పడిన వాటి నుంచి దూరంగా ఉంచాలి.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- చిత్తడితో పశుసంపదకు పలు రుగ్మతల ముప్పు
- పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ
- ఇప్పటికే జబ్బ, చిటుకు వ్యాధులకు విస్తృతంగా టీకాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



గొంతువాపు వ్యాధి వచ్చిన పశువు



బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో చిత్తడి వాతావరణం నెలకొంది. మనుషులతో పాటు పశువులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వర్షాల వల్ల పశువుల్లో అనేక వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. గొర్రెలు, మేకల్లో కూడా వైరస్, బ్యాక్టీరియా వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముంది. పశుసంవర్ధక శాఖ అధికారులు ఇటీవల జబ్బ వ్యాధి, గొర్రెల్లో వచ్చే చిటుకు వ్యాధులకు టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 16,02,698 పశుసంపద ఉంది. ఇందులో ఆవులు 120565, గేదెలు 293830, గొర్రెలు 882449, మేకలు 305854 ఉన్నాయి.

తొలకరిలో వచ్చే వివిధ వ్యాధుల నివారణ...

చిటుకు వ్యాధి..

గొర్రెలలో చిటుకు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. జీవాలు తూలుతూ నడుస్తాయి. ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి పడి చిటికెలో చనిపోతాయి. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. మందలో 10కి పైగా జీవాలు చనిపోతే చిటుకు వ్యాధి సోకినట్లుగా భావించవచ్చు. నీరసంగా ఉన్న గొర్రెలను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని గొర్రెలకు వ్యాక్సిన్ వేయించాలి.

నీలి నాలుక వ్యాధి..

ఈ వ్యాధి గొర్రెలు, మేకల్లో వస్తుంది. వైరస్ వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడుతాయి. ఆహారం తీసుకోకుండా, బలహీనంగా ఉంటాయి. వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి దూరంగా గుంపుగా ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీబయోటిక్స్, లివర్ టానిక్ ఉపయోగించాలి. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి, మిగిలిన వాటికి టీకాలు అందించాలి.

గొంతువాపు వ్యాధి..

ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి అన్ని వయస్సుల గేదెలు, ఆవుల్లో కనిపిస్తుంది. 105 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుతుంది. అలాగే నోటి నుంచి ఎక్కువగా గాలి పీల్చుకుంటాయి. మేత తీసుకోకుండా గొంతు వద్ద వాపు కనిపిస్తుంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందును ఉపయోగించాలి. నాలుగు నెలలు దాటిన జీవాలకు కచ్చితంగా టీకా వేయించాలి.

గాలికుంటు వ్యాధి..

ఇది వైరస్ వల్ల ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్లో కనిపిస్తుంది. నోరు, గిట్టలలో పుండ్లు పడటం, ఎక్కువగా జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన చూడి పశువులు నాలుగు నెలల్లో ఈసుకుపోతాయి. నివారణకు బోరిక్ గ్లిజరిన్ పేస్టును నోటిలో పుండ్లకు పూతగా పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్టల మధ్య కడగాలి. యాంటీబయోటిక్ మందులు, లివర్ టానిక్ ఉపయోగించాలి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలి.

అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులకు సంబంధించి ఇప్పటికే టీకాలు వేశాం. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. అన్నదాతలు నిర్లక్ష్యం చేయకుండా పశువులు, జీవాలకు టీకాలు వేయించుకోవాలి. స్థానిక ఆర్బీకేల్లోని పశుసంవర్ధక సహాయకుల దగ్గర అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా అత్యవసరమైతే టోల్‌ఫ్రీ నంబరు 1962కి కాల్ చేయాలి. ముఖ్యంగా పాకల్లో పాడి వాతావరణం, శుభ్రంగా ఉంచుకోవాలి.

– వెంకటసుబ్బారెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, నంద్యాల జిల్లా

వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- దాణా అందుబాటులో ఉంచుకోవాలి. తడిచిన పశువులకు దాణా పెట్టకూడదు
- పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండుగడ్డి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మేతలను అధికంగా పెట్టకూడదు. గుంపుగా అన్నింటినీ ఒకే చోట కట్టి వేయరాదు
- జంతువులు చనిపోతే కాల్చటం, పూడ్చటం చేయాలి.
- యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ అందుబాటులో ఉంచుకోవాలి.
- పశువులకు ఆహారం, తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలి.

గ్రామ పంచాయతీలకు నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరయ్యాయని ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. విద్యుత్ బకాయిలు మినహాయించుకుని 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. అల్లూరు గ్రామ పంచాయతీకి రూ. 2,11,124, బోడెమ్మనూరుకు రూ. 1,85,169, గోవిందపల్లె రూ. 57,604, హరివరంకు రూ. 3,32,970, ఇంజేడు రూ. 2,05,138, కాకరవాడకు రూ. 1,74,006, కొండుపల్లె రూ. 1,37,963, మాయలూరు రూ. 1,37,235, నర్సిపల్లెకు రూ. 1,01,502 మంజూరయ్యాన్నారు. పడిగెపాడు రూ. 82,727, పెద్దయమ్మనూరు రూ. 2,54,186, పుచ్చకాయలపల్లె రూ. 78,182, ఆర్.జంబులదిన్నె రూ. 1,89,712, ఆర్.పాంపల్లె రూ. 1,65,082, రూపనగుడి, రూ. 1,40,083, సర్వాయిపల్లె రూ. 1,47,708, ఎస్.కొత్తపల్లె రూ. 81,420, సుద్దమల్ల రూ. 60,162, తుడుములదిన్నె రూ. 1,20,583, ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీకి రూ. 3,95,926 నిధులు కేటాయించారు. ఈ నిధులు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అధ్యక్షతన వార్డు మెంబర్లతో సమావేశం ఏర్పాటు చేసుకుని అత్యవసర పనుల నిమిత్తం వినియోగించుకోవాలని ఈఓపీఆర్డీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలే లక్ష్యం

దొర్నిపాడు: బహిరంగా మల, మూత్ర విసర్జన రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీఆర్సీ దస్తగిరిబాషా సూచించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఈఓపీఆర్డీ నాగఅనసూయ ఆధ్వర్యంలో స్థానికులు, విద్యార్థులకు అవగాహన కల్పించి, కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించేకునేలా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తడి, పొడి చెత్తలను వేర్వేరు బుట్టల్లో వేయాలన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చామని ధైర్యంగా చెబుతున్నాం
- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మొదలు పెట్టిన మొదటి రోజు నుంచే అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. దీంతో మళ్లీ ఆయనే సీఎంగా కావాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని గాయత్రీ దేవాలయం కాలనీలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మమేకమయ్యారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు వారికి ఏఏ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. గతంలో ఎన్నికలు ముగిసిన తరువాత మళ్లీ ఎన్నికలు వచ్చేవరకు పాలకులు ప్రజల ముఖం చూసేవారు కాదన్నారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో ధైర్యంగా తిరుగుతూ, గర్వంగా ఇవి చేశామని చెప్పగలుగుతున్నామన్నారు. దశాబ్దాల రాజకీయ చరిత్రలో పార్టీలు, కులాలు, మతాలు, కులాలు, వర్గాలకు అతీతంగా ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కాలనీలో ప్రతి ఇంటి వద్ద ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్లు సోముల రాధ, బాలబ్బి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, అజాద్ ఉన్నారు

రైతులకు వ్యవసాయ పనిముట్లు



రైతు భరోసా మాస పత్రికను అందజేస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

దొర్నిపాడు: ఇక నుంచి రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల సలహా కమిటీ చైర్మన్ వంగల భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల స్థాయి కమిటీ, దొర్నిపాడు సహకార సంఘం చైర్మన్ భూమా చెంచిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిచారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ద్వారా అందజేస్తుందన్నారు. అలాగే పగలే నాణ్యమైన 9గంటల ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. జింక్, జిప్సం, లింగాకర్షక బుట్టలను సబ్సిడీ రూపంలో ఇవ్వడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓసీలకు కూడా కౌలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. అనంతరం రైతులకు రైతుభరోసా మాస పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు సరళమ్మ, మంజువాణి, ఏఓ సునీత, పశువైద్యాధికారి పుల్లయ్య, సచివాలయాల మండల కన్వీనర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పారదర్శకంగా ఉండాలి



ఆర్.నాగులవరంలో బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

రుద్రవరం: ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చూడాలని నంద్యాల సబ్ కలెక్టర్, ఆళ్లగడ్డ ఎన్నికల పర్యవేక్షణాధికారి శ్రీనివాసులు బీఎల్‌ఓలకు సూచించారు. మండల పరిధిలోని నర్సాపురం, ఆర్.నాగులవరం, కొండమాయపల్లె గ్రామాల్లో బూత్‌లెవెల్ అధికారులు చేపట్టిన ఓటరు నమోదు సర్వేను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను గుర్తించి ఓటు హక్కు నమోదు చేయించాలని సూచించారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, వీఆర్వోలు ఓబయ్య, పుల్లయ్య తదితరులు ఉన్నారు.


పారదర్శకంగా ఓటర్ల జాబితా

నంద్యాల(అర్బన్): రాజకీయ పార్టీల సహకారంతో పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు అవుతుందని డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితా తయారీపై పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీఎల్‌ఏల కో ఆర్డినేషన్‌తో ఓటర్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 21 నుంచి వచ్చే నెల 21వరకు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త వారిని ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి చంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆళ్లగడ్డ : ఓటరు జాబితాలో తప్పుల సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని నంద్యాల సబ్ కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణలపై మంగళవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఈ నెల 21వ తేదీ వరకు ఇంటి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజకీయపార్టీల నాయకులు తమ ప్రతినిధులను నియమించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

‘జగనన్న తోడు’ లక్ష్యాన్ని పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జగనన్న తోడు పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఫేజ్-7 కింద బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్గత రుణాన్ని సులభతరం చేయడానికి ఎస్‌బీ ఖాతాలో అందుబాటులో ఉన్న ఎస్ఎస్‌జీ కార్పస్ నుంచి ఉపసంహరణలకు అనుమతించాలన్నారు. అర్హత ఆధారంగా పరిమితులు పెంచడం జరుగుతుందన్నారు. ఆరోగ్య బీమా ప్రీమియంతో ఎస్‌హెచ్‌జీ గ్రూపు ఖాతాలను డెబిట్ చేయరాదని సూచించారు. రోజువారి మార్గదర్శకాల ప్రకారం ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణాలు మంజూరు చేటప్పుడు డిపాజిట్లపై బ్యాంకర్లు ఎలాంటి పట్టుపట్టరాదన్నారు. గ్రూపు సభ్యులకు వ్యక్తిగత ఫైనాన్స్, పీఎంఈజీపీ, జీవనజ్యోతి, పీఎంఎఫ్ఎంఈ ముద్ర రుణాలు జీవనోపాధి కోసం ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ డీఏఓ మోహన్‌రావు మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులకు, పశుపోషక, మత్స్యకారులకు ప్రభుత్వ క్రాప్ రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవీంద్రబాబు, మేనేజర్ చంద్రశేఖర్, ఆంధ్రాబ్యాంకు లింకేజీ కో ఆర్డినేటర్ ఎల్లయ్య, వెలుగు సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ల పండుగ



ఆర్.పాంపల్లె గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేస్తున్న ఎంపీటీసీ కపురం శివమ్మ

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం మంగళవారం పండుగలా సాగింది. తెల్లవారుజామునే వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు అవ్వా తాతలకు తలుపు తట్టి నగదును వారి చేతిల్లో పెట్టారు. ఆర్.పాంపల్లె గ్రామంలో లబ్ధిదారులైన హుసేనమ్మ, గౌరి, రాములమ్మ, తిరుపాలమ్మలకు ఒక్కొక్కరికి రూ. 2,750లు ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, వలంటరీ మహమ్మద్ రఫి అందజేశారు. మండలంలో 3,782 పింఛన్లకు గాను రూ. 1,03,72,000లు ప్రభుత్వం మంజూరు చేసింది. తొలిరోజు 65 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. 3వ తేదీ సాయంత్రంలోగా వంద శాతం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

సంక్షిప్తం

పేదలకు వైద్యవిద్యను దూరం చేయొద్దు

నంద్యాల(న్యూటౌన్): పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయొద్దని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పద్మావతినగర్ ఆర్చి వద్ద ధర్నా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు వైద్య విధానానికి ఖర్చు చేస్తోందన్నారు. నంద్యాలలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. అయితే 107-108 ఉత్తర్వుల ద్వారా 50శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐల ద్వారా భర్తీ చేస్తుందని, 25శాతం సీట్లను మాత్రమే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ : కోటకందుకూరు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్లు భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 4వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి జాయిన్ కావచ్చన్నారు.

నేడు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల సాయిబాబానగర్‌లోని స్వామిరెడ్డి భవన్ సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, రామచంద్రయ్య, జగదీష్, రామాంజనేయులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్న పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాల పీఎస్సీ అండ్ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. మనం నాటిన మొక్కలు మనమే కాపాడుకోవాలని, వాటి వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు.

ఆశావర్కర్లకు పనిభారాన్ని తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేసి, పని భారాన్ని తగ్గించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణకుమారి, సీఐటీయూ కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, నియామకాలు ప్రభుత్వమే నిర్వహించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరారు. సమావేశంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు చెన్నమ్మ, సువర్ణ, రాజేశ్వరి, నాగలక్ష్మి, సుభద్ర, ఆశాబీ, పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అధిక శ్రావణమాసం పురస్కరించుకొని మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీధనలక్ష్మీ పూజ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాసం, పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం లోక కల్యాణం కోసం విశేష శ్రీధనలక్ష్మి పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి 108 జంటతో సామూహికంగా పూజలుచేయించారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ సభ్యులు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం హోమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మాస్పటిక లింగేశ్వర ఆలయంలో అధిక శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని లోకకల్యాణార్థం హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మాస్పటిక లింగేశ్వరానికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించారు. అనంతరం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో తిమ్మయ్య, వెంకటేశ్వరరెడ్డి, అనిల్, వెంకటసుబ్బయ్య, రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మౌలాలి స్వామి గ్రామోత్సవం



గోస్పాడులో గ్రామోత్సవంలో మౌలాలిస్వామి

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులో మౌలాలి స్వామి జార్తల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జార్తల మహోత్సవంలో భాగంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఏడాది గోస్పాడులో మొహర్రం అనంతరం జార్తల మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయుతీగా మారింది. మొహర్రం సందర్బంగా ఏర్పాటు చేసిన పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు నిర్వహించారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో మంగళవారం మౌలాలి స్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం చావిడీ నిర్వాహకులు మొహర్రం వేడుకలు ముగిసిన మూడో రోజు సోమవారం రాత్రి పీరుకు జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం పీరును పూల సూచికాలు, దట్టీలు, వెండి గొడుగులతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

‘ఆడుదాం.. ఆంధ్రా’ మస్కట్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా పోటీల మస్కట్ లోగో కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కళాశాలలు, యూనివర్సిటీలోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని మస్కట్ లోగో డిజైన్ చేయాలని సూచించారు. ఉత్తమ మస్కట్ డిజైన్ చేసిన వారికి ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన నంద్యాల జిల్లాలోని క్రీడాకారులుఆన్‌లైన్‌లో https://sports. ap. gov.in ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీలోపల డిజైన్ పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం నంద్యాల జిల్లా క్రీడాప్రాధిక సంస్థ ముఖ్యశిక్షకుడు సెల్:9885240365 నెంబరుకు సంప్రదించాలన్నారు.

సచివాలయ సిబ్బంది డ్రస్ కోడ్ పాటించాలి

గోస్పాడు: సచివాలయ ఉద్యోగులందరూ తప్పని సరిగా డ్రస్ కోడ్ పాటించాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ప్రతి రోజూ సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు.